

# మనం
## ఖమ్మం
### భద్రాద్రి కొత్తగూడెం-మహబూబాబాద్

ఆదివారం | 06 | ఆగస్టు | 2023 | పేజీలు : 7




# పాత కేసులను త్వరితగతిన విచారించేలా కృషి

**– ప్రిన్సిపల్ జిల్లా జడ్జి పాటిల్ వసంత్**

**పోలీసు అధికారులతో సమన్వయ కమిటీ సమీక్ష సమావేశం**

**భద్రాద్రి కొత్తగూడెం, ఆగస్ట్ 5 (మనంప్రతినిధి) :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రధాన న్యాయమూర్తి పాటిల్ వసంత్ పోలీసు, ఫారెస్ట్, ఎక్సైజ్ అధికారులతో సమన్వయ సమావేశం ఏర్పాటు చేశారు. అధికారులకు వాళ్ళ సమస్యలను పరిష్కరించే దిశగా కృషి చేశారు. పోలీసు అధికారుల తో పెండింగ్ కేసులలో కేసు ప్రాపర్టీ డిపాజిట్ వేను వెంటనే డిపాసిట్ చేయాలని, పాత కేసులను త్వరితగతిన విచారించేందుకు సాక్షులను పబ్లిక్ ప్రాసిస్యూటర్ల వద్ద ప్రవేశపెట్టవలసినదిగా సూచించారు. ఎక్సైజ్ కేసులలో, గంజాయి కేసులలో వారంట్ లను అమలు పర్చాలని సూచించారు. వారెంట్లు అమలు కాని పరిస్థితులలో జమానదారులకు నోటీసులు ఇచ్చి కోర్టుకు రప్పించ వలసినదిగా ఆదేశించారు. న్యాయమూర్తులు ఎం.శాం శ్రీ, జి భానుమతి, ఆడెపు నీరజ, బత్తుల రామారావు, ఏ సుచరిత, భద్రాచలం ఏఎస్పి పారితోష్ పంకజ్, ప్రొహిబెషన్ అండ్ ఎక్సైజ్ సూపర్డెంట్ ఎస్. జానయ్య, కొత్తగూడెం డిఎస్పి షేక్ అబ్దుల్ రెహమాన్, డిసిఆర్బి డిఎస్పి ఎన్.మల్లయ్య స్వామి కొత్తగూడెం టౌన్ రూరల్ ఇన్స్పెక్టర్సు ఏం కరుణాకర్, తోగేటి రమేష్ మురళీ,భద్రాచలం జైలు సూపర్డెంట్ జె.ఉపేందర్, ఇల్లందు జైలు సూపరిండెంట్ ఎన్.చంద్రశేఖర్, ఫారెస్ట్ రేంజ్ అధికారులు జి ఉమా, ఎమ్.అనిల్ కుమార్, బి శ్రీనివాస్ రెడ్డి, ఆర్ చంద్రశేఖర్, జి ప్రసాదరావు, ఎస్ సురేష్, ఆర్ అండ్ బి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్స్ బి.బివ్లా, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్స్ , ఐ.నాగేశ్వరరావు, వి వెంకటేశ్వరరావు, సబ్ ఇన్స్పెక్టర్లు సయ్యద్ షాహినా,జె.ప్రవీణ్, కే సుమన్ కోర్టు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లండి..

**నాయకులు క్షేత్రస్థాయిలో ప్రజలకు అందుబాటులో ఉండాలి**

**మూడోసారి బిఆర్ఎస్ గెలుపు ఖాయం:**

**ప్రభుత్వ విప్ రేగా కాంతారావు**

7 లో

# రైల్వే స్టేషన్ల అభివృద్ధికి నిధులు

– ఖమ్మం, కొత్తగూడెం, మధిర రైల్వే స్టేషన్లకు రూ.25 కోట్లు చొప్పున మంజూరు

– ఎంపీ నామ వెల్లడి



**ఖమ్మం, ఆగస్ట్ 05(మనం బ్యూరో):** ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని పలు రైల్వే స్టేషన్ల అభివృద్ధికి, కనీస సదుపాయాల కల్పనకు సత్వరమే నిధులు విడుదల చేయాలని కోరుతూ కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ కు పలు విడతలుగా రాసిన లేఖకు స్పందనగా ,రైల్వే శాఖ నిధులు విడుదల చేసిందని బీఆర్ఎస్ లోక్ సభా పక్ష నాయకులు, ఖమ్మం పార్లమెంట్ సభ్యులు నామ నాగేశ్వరరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.ఖమ్మం, మధిర, కొత్తగూడెం రైల్వే స్టేషన్ల అభివృద్ధికి ఈ నిధులు విడుదలయ్యాయని చెప్పారు. ఒక్కో రైల్వే స్టేషన్ అభివృద్ధికి రూ.25 కోట్లు చొప్పున నిధులు కేటా యించారని తెలిపారు. ఖమ్మం జిల్లాలోని మిగతా రైల్వే స్టేషన్ల అభివృద్ధికి కూడా ఒక్కో దానికి రూ.10 కోట్లు చొప్పున మంజూరుకు రైల్వే మంత్రి హామీ ఇచ్చారని నామ పేర్కొన్నారు. రైల్వే జెడ్ ఆర్యూసీసీ సభ్యునిగా రెండో సారి భాద్యత లు తీసుకోగానే పలు విడతలుగా రైల్వే మంత్రితో భేటీ అయి, సమ స్యలు నివేదించి, లేఖలు అందించానని చెప్పారు. కోర గానే ఖమ్మం జిల్లాలోని రైల్వే స్టేషన్ల అభివృద్ధికి నిధులు మంజూరు చేసిన రైల్వే మంత్రికి కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు నామ నాగేశ్వరరావు చెప్పారు.

# భద్రాచలం రోడ్ రైల్వేస్టేషన్ ఆధునీకరణ




## పర్చువల్ పద్ధతితో పనులకు నేడు మోడీ శంకుస్థాపన

**భద్రాద్రి కొత్తగూడెం, ఆగస్ట్ 4 (మనంప్రతినిధి) :** నేడు ప్రధాని నరేంద్ర మోడి వర్చువల్ పద్ధతిలో భద్రాచలం రోడ్ (కొత్తగూడెం) రైల్వే స్టేషన్లో 24.40 కోట్ల రూపాయల వ్యయంతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే ముఖ్య ప్రజా సంబంధాల అధికారి సిహెచ్ రాకేష్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. భారతీయ రైల్వేల ఆధునీకరణ దిశలో భారత ప్రభుత్వ నూతన భారతదేశం దిశగా ప్రభుత్వ దృక్పథాన్ని సాకారం చేయడంలో వేగంగా ముందుకు సాగుతున్నాయని ముఖ్య ప్రజా సంబంధాల అధికారి సిహెచ్ రాకేష్ తెలిపారు. భద్రాచలం రోడ్డు (కొత్తగూడెం) రైల్వే స్టేషన్ కు సంబంధించి ఇప్పటికే ఆధునీకరణ పనులు జరిగాయని, అందులో భాగంగా 12 మీటర్ల ఫుట్ ఓవర్ బ్రిడ్జ్, ప్లాట్ ఫామ్ మీద అదనపు కవరేజీ, టాయిలెట్ల ఆధునీకరణ, నూతన టాయిలెట్ల నిర్మాణం, వెయిటింగ్ హాల్ ఆధునీకరణ, స్టేషన్ ఆవరణ సుందరీకరణ, ప్రయాణికులకు అనుకూలంగా సూచికలు, లిఫ్టులు ఎస్కలేటర్, టెలికాం సేవలు తదితర అంశాలలో భద్రాచలం రోడ్డు స్టేషన్లో ఆధునీకరణ పనులు జరగనున్నాయని ఆయన తెలిపారు. రైల్వే స్టేషన్లను ప్రపంచ స్థాయి స్థాపనలుగా తీర్చిదిద్దే పనులు దేశవ్యాప్తంగా శరవేగంగా జరుగుతున్నాయని, ఈ ప్రయత్నాన్ని తదుపరి స్థాయికి తీసుకెళ్తూ, ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఆగస్టు 6 న దేశవ్యాప్తంగా అమృత్ భారత్ స్టేషన్ పథకం కింద 508 రైల్వే స్టేషన్ల అభివృద్ధికి శంకుస్థాపన చేయనున్నట్లు ఆయన తెలిపారు. ఈ పథకంలో దక్షిణ మధ్య రైల్వే పరిధిలోని 50 రైల్వే స్టేషన్లు ఉన్నాయని, సికింద్రాబాద్ కేంద్రంగా ఉన్న దక్షిణ మధ్య రైల్వే 4 రాష్ట్రాలలో విస్తరించిందని, అమృత్ భారత్ స్టేషన్ పథకం ( ఎబి ఎస్ ఎస్ ) యొక్క ఈ మొదటి దశలో, తెలంగాణలో 21 స్టేషన్లు, ఆంధ్రప్రదేశ్లో 15 స్టేషన్లు, మహారాష్ట్రలో 13 స్టేషన్లు మరియు కర్ణాటకలో 1 స్టేషన్కు కలిపి దాదాపు 2లో..

# జె-హబ్, జెఎన్‌టియుహెచ్ ఐడియా ఎక్సయిట్ - 2023-24 లో ప్రతిభ చాటిన 'ప్రియదర్శిని' విద్యార్థినులు

**ఖమ్మం, ఆగష్టు 5(మనం న్యూస్) :** జె- హబ్, జేఎన్టీయూహెచ్ సంయుక్తంగా నిర్వహిస్తున్న ఐడియా ఎక్సయిట్ ప్రోగ్రాం - 2023 ప్రోగ్రాం లో కళాశాల కు చెందిన కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ విభాగం, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ అండ్ మెషిన్ లెర్నింగ్ నుండి రెండు టీమ్స్ ఎంపిక చేయబడ్డాయి. రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం 70 కళాశాలలు ఈ విభాగంలో పాల్గొన్నాయి. మొత్తం 250 ప్రాజెక్టులు అందగా 28 ప్రాజెక్టులు షార్ట్లిస్ట్ అయ్యాయి. హైదరాబాద్ లో పెరొన్నికగొన్న కళాశాలలకు దీటుగా ప్రియదర్శిని కళాశాల, చెందిన ఇద్దరు విద్యార్థినుల ప్రాజెక్టు టర్నింగ్ హుమిడ్ హెయిర్ ఇన్ టూ వాటర్,- పి సూసన్న ప్రిన్సిరాజ్ కూరపాటి హారిక - ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అండ్ మెషిన్ లెర్నింగ్ విభాగం; మరియు ఏఐ బేస్డ్ డిజిటల్ టెక్స్ట్ బుక్ - చల్లా కుసుమ మరియు ఊటుకూరు శ్రీలేఖ సి.ఎస్.ఈ విభాగం మూడవ సంవత్సరం. కళాశాల చైర్మన్ డాక్టర్ కాటేపల్లి నవీన్ బాబు గారు మాట్లాడుతూ యువ శాస్త్రవేత్తలను ప్రోత్సహించడం కోసం వారిలో పరిశోధన మరియు అభివృద్ధి శక్తి పెంపొందించడం కోసం జేఎన్టీయూలో జె - హబ్ ను ప్రారంభించడం ఒక శుభ సూచకం, హైదరాబాదులో ఉన్న మేటి విద్యాసంస్థలతో పోటీపడుతూ ఖమ్మంలో మారుమూల ప్రాంతంలో ఉన్న కళాశాల కు చెందిన రెండు ప్రాజెక్టులు ఎన్నిక కావడం హర్షనియమైనదని, ఖమ్మం జిల్లాలోనే పరిశోధనా మరియు అభివృద్ధి శాఖను 2021 లోనే ప్రారంభించడం జరిగిందని దానికోసం ల్యాబ్, ఇంకుబేషన్ సెంటర్ ను ప్రారంభించిన ఏకైక యంత్ర కళాశాల మన ప్రియదర్శిని అని చెప్పడం చాలా ఆనందంగా ఉందని తెలిపారు. అకడమిక్ డైరెక్టర్ అట్లూరి వెంకటరమణ మాట్లాడుతూ మనం జీవితంలో ఏదైనా సాధించాలంటే వ్యక్తిగత ఆసక్తి ముందుగా ఉండాలని అన్నారు. విద్యార్థులలో సృజనాత్మకత జ్ఞానం చాలా అవసరమని, సృజనాత్మకత వ్యక్తీకరణల ద్వారా కొత్త పద్ధతులను సృష్టించడం,





కొత్త ఉత్పత్తులను కనిపెట్టడం, కొత్త సాంకేతికతలను నవీకరించడం, కొత్త సిద్ధాంతాలను నిర్వచించడం జరుగుతుందని తెలిపారు. పరిశోధన మరియు అభివృద్ధికి సంబంధించిన వాటిలో విద్యార్థినులకు కావాల్సిన మెళుకువలు నేర్పటం లో సందేహాలను మరియు సమస్యలను పరిష్కరించడంలో కళాశాలకు చెందిన నిష్ణాతులైన అధ్యాపకులు ఎప్పుడు ముందుంటారని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ బి గోపాల్ గారు తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ విభాగాధిపతులు, రీసెర్చ్ అండ్ డెవలప్మెంట్ కోఆర్డినేటర్ వి నాగరాజు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# సమస్యలతో కునారిల్లుతున్న సంక్షేమ వసతి గృహాలు

## 8 నెలలుగా డైట్ బిల్లు లేక వార్డెన్ల అవస్థలు
## చాలీచాలని మెస్ చార్జీలతో విద్యార్థుల అర్ధాకలి
## దోమలకు కేరాఫ్ అడ్డాగా వసతి నిలయాలు
## కేవీపీఎస్ సర్వేలో వెల్లడైన హాస్టల్లో దుస్థితి



**ఖమ్మం, ఆగష్టు 05(మనం బ్యూరో) :** సమస్యలతో సహవాసం చేస్తూ సంక్షేమ వసతి గృహాలు కునారిల్లుతున్నాయని, గత ఎనిమిది నెలలుగా డైట్ బిల్లులు రాకపోవడంతో వార్డెన్లు అప్పులు తెచ్చి హాస్టళ్లను నడుపుతున్నారని, చాలీచాలని మెస్ చార్జిలతో విద్యార్థులు అలమటిస్తున్నారని, దోమల నివారణ చర్యలు చేపట్టకపోవడంతో దోమలకు కేరాఫ్ అడ్డాగా వసతి నిలయాలు ఉన్నాయని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కెవిపిఎస్) జిల్లా ప్రధాన కార్యదర్శి నందిపాటి మనోహర్ ప్రభుత్వాన్ని దుయ్యబట్టారు. శుక్ర, శనివారాల్లో కెవిపిఎస్ ఆధ్వర్యంలో స్థానిక ఎన్ఎస్పి క్యాంపు లోని ప్రీ మెట్రిక్ బాల, బాలికల వసతి గృహాలను, ఆనంద నిలయాలను కెవిపిఎస్ జిల్లా ప్రతినిధి బృందం స్వయంగా వెళ్లి విద్యార్థులను, అధికారులను ప్రత్యక్షంగా కలిసి సమస్యలపై సర్వే నిర్వహించారు. ఈ సర్వేలో వచ్చిన సమస్యలపై మనోహర్ మాట్లాడుతూ స్థానిక జిల్లా కేంద్రంలోని ఎన్ఎస్పి క్యాంపులో ఎస్సీ సి హాస్టల్ పురాతన ప్రహరీ గోడ కూలిపోయి సంవత్సరాలు గడుస్తున్న నేటికీ గోడ నిర్మాణం చేపట్టడంతో పందులు, కుక్కలు, విషపురుగులు వస్తున్నాయని దీంతో భయభ్రాంతులకు గురవుతున్నామని మా సర్వే వద్ద విద్యార్థులు వాపోయారని, తక్షణమే ప్రహరీ గోడ నిర్మాణానికి నిధులు కేటాయించి పనులు చేపట్టాలని వారు అధికారులను డిమాండ్ చేశారు. దోమల నివారణకు ఎలాంటి చర్యలు చేపట్టకపోవడంతో ప్రస్తుత వర్షాకాల సీజన్ కాలంలో విష జ్వరాలు ప్రబలే ప్రమాదం ఉందని, తక్షణమే ప్రతి హాస్టళ్లకు దోమల జాలీలు



పెట్టాలని, దోమతెరలు, జెట్ కాయిల్స్ ఇవ్వాలని, పరిసరాల శుభ్రతకు చర్యలు చేపట్టాలని వారు కోరారు. గతంలో ఇచ్చిన ప్యూరిఫైడ్ వాటర్ ప్లాంట్ లు ఏ హాస్టల్లో కూడా కనిపించడం లేదని అవి రిపేర్లు వచ్చాయని స్టోర్ రూమ్ లో పడేసామని సిబ్బంది చెప్తున్నారు. పర్మినెంట్ హెచ్ డబ్ల్యూ ఓ లు, సిబ్బంది లేకపోవడంతో ఇంచార్జిలతో, జూనియర్ అసిస్టెంట్లతో, ఔట్సోర్సింగ్ సిబ్బందితో హాస్టల్స్ నడవడంతో విద్యార్థుల రక్షణ, సంక్షేమం కరువైందని వారు విమర్శించారు. పెండింగ్ లో ఉన్న కాస్మొటిక్ చార్జీలను తక్షణమే విడుదల చేయాలని, ప్రస్తుతం కేవలం బాలురకు 62, బాలికలకు 55, 75 రూపాయలు ఏ మాత్రం సరిపోవడం లేదని తక్షణమే కాస్మోటిక్ చార్జీలు పెంచాలని డిమాండ్ చేశారు. హాస్టల్స్ మెయింటెనెన్స్ కి నిధులను పెంచి ఇవ్వాలని, విద్యార్థుల భాగోగులకు అధికారులు అండ ఇవ్వాలని, సరైన పౌష్టికాహారం అందించాలని వారు ఈ సందర్భంగా డిమాండ్ చేశారు లేనియెడల జిల్లా మొత్తం హాస్టల్లో సర్వే చేసి వచ్చిన సమస్యలపై కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా చేపట్టనున్నట్లు వారు ప్రభుత్వాన్ని హెచ్చరించారు ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ జిల్లా నాయకులు బొట్ల సాగర్ , నగరికంటి చిరంజీవి, పట్టణ నాయకులు గుమ్మడి బిక్షం, జగ్రిపోతుల కిరణ్, గొర్రెముచ్చు శాంతయ్య, భద్రం పాల్గొన్నారు.

# నిరుపేద ఆర్యవైశ్య కుటుంబానికి ఆర్థికసాయం



**ఖమ్మం, ఆగష్టు 5(మనం న్యూస్) :** ఇటీవల కురిసిన అకాల వర్షానికి కొరివి మండలం నేరేడ గ్రామానికి చెందిన నిరుపేద ఆర్యవైశ్యుడు కొత్త వెంకన్న తండ్రి అప్పయ్య ఇల్లు మొత్తము కూలిపోయింది. ఆర్థికంగా ఇబ్బందిగా పడుతున్న విషయం తెలుసుకున్న వాసవి క్లబ్ కపుల్స్ ఈగ శ్రీనివాస్ అధ్యక్షతన ఐఈసి ఆఫీసర్ గోల్డెన్ స్టార్ మాలే యోగేశ్వరరావు చేతుల మీదుగా పదివేల రూపాయలు వారి ఇంటి నిర్మాణం కోసం అందచేశారు. ఈ కార్యక్రమంలో ఇంటర్నేషనల్ కోఆర్డినేటర్ ఇమ్మడి కృష్ణమూర్తి, సెక్రెటరీ జంగాల సదాశివుడు , ట్రెజరర్ మాలే నవీన్, సభ్యులు ఇమ్మడి జగదీశ్వర్, బొడ్ల శ్రీనివాస్ , నల్ల వేణుగోపాల్, ఇతర సభ్యులు పాల్గొన్నారు.

# కళాశాల అధ్యాపకులకు ప్రశంసలు

**ఖమ్మం, ఆగష్టు 5(మనం న్యూస్) :** స్థానిక ఎస్ ఆర్ బి.జి.ఎన్.ఆర్ కళాశాల ఇటీవల న్యాక్ ఎసెస్మెంట్ లో ఏ ++ 3.64 సీ.జి.పి.ఏ పాయింట్స్ సాధించిన సందర్భంగా అధ్యాపకులను తెలంగాణ ఉన్నత విద్య కార్యదర్శి, కళాశాల విద్యా కమిషనరైన వాకాటి కరుణ తరుపున కమిషనరేట్ అకడమిక్ గైడెన్స్ ఆఫీసర్ డా.డి.టి.చారి, కళాశాల ప్రిన్సిపాల్ డా.మొహ్మద్ జాకిరుల్లా తో కలిసి శుక్రవారం కళాశాల ను సందర్శించి ఐ.క్యూ.ఏ.సి విభాగం వారిని ఇతర విభాగాల అధ్యాపకులకు ప్రశంసిస్తూ సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖమ్మం కళాశాల, రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో ప్రత్యేక గుర్తింపు పొందినదని, ప్రిన్సిపాల్, అధ్యాపకులు విద్యార్థులు సంయుక్తంగా అద్భుతమైన ఫలితాన్ని సాధించారని తెలిపారు.వాకాటి కరుణ పంపిన సందేశాన్ని అందించారు అనంతరం ఐ.క్యూ.ఏ.సి కోఆర్డినేటర్ డా.రమాసత్యవతి, సభ్యులు డా.సిహెచ్.శ్రీనివాసులు, డా.ఎస్.రమేష్, డా.డి.శ్రీనివాస్, డా.సునంద , ఎం.అనురాధ, టెక్నికల్ గా సహకరించిన ఈ.వేలాద్రి, ఉషాపావని, వి.స్వప్న,గులాబ్ సింగ్,కె.వి.ఆర్.కె దుర్గ, పుల్లారావు తదితరులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కె.యు.ఈసి మెంబర్ గా.సీతారాం, కంప్యూటర్ విభాగాధిపతి డా.సురేష్ బాబు , అధ్యాపకులు,ఆఫీస్ వింగ్, విద్యార్థులు పాల్గొన్నారు.



# 7న ఎస్ఆర్ గార్డెన్స్ లో ఐ ఎన్ టీ యూసీ ఆటో డ్రైవర్ల యూనియన్ సభ

## - ముఖ్యఅతిథిగా హాజరుకానున్న పొంగులేటి శ్రీనివాస రెడ్డి
## - ఐ ఎన్ టీ యూ సీ జిల్లా అధ్యక్షులు కొత్త సీతారాములు

**ఖమ్మం, ఆగష్టు 5(మనం న్యూస్) :** ఐ ఎన్ టీ యూ సీ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఖమ్మం జిల్లాలోని ఆటో డ్రైవర్ల యూనియన్ సభ ఖమ్మం నగరం వైరా రోడ్డులోని ఎస్ఆర్ గార్డెన్స్ లో ఈనెల 7న సోమవారం జరుగుతుందని ఆ సంఘం జిల్లా అధ్యక్షులు కొత్తా సీతారాములు తెలిపారు. డీసీసీ కార్యాలయంలో జరిగిన ఐ ఎన్ టీ యూ సీ జిల్లా కార్యవర్గ సమావేశంలో ఈ మేరకు ఆయన వివరాలు వెల్లడించారు. ఈ సభకు తెలంగాణ కాంగ్రెస్ ప్రచార కమిటీ కో చైర్మన్ పొంగులేటి శ్రీనివాస రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరవుతారని తెలిపారు. ఈ సభలో ఆటో డ్రైవర్లకు ఖాకీ చొక్కాలతో పాటు కిమ్స్ హాస్పిటల్ తరుపున 50శాతం రాయితీతో కూడిన హెల్త్ కార్డులను పొంగులేటి చేతుల మీదుగా అందించనున్నట్లు పేర్కొన్నారు. జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, నగర కాంగ్రెస్ అధ్యక్షులు మహ్మద్ జావిద్, నగర కాంగ్రెస్ పార్టీ నాయకులు, ఇతర అనుబంధ సంఘాల నాయకులు కూడా అతిథులుగా పాల్గొంటారన్నారు. కావున జిల్లా వ్యాప్తంగా ఉన్న ఆటో డ్రైవర్ సోదరులందరూ అధిక సంఖ్యలో పాల్గొని సభను విజయవంతం చేయాలని ఆయన కోరారు.

# భద్రాచలం రోడ్ రైల్వేస్టేషన్...

(మొదటి పేజీ తరువాయి)

రూ. 2.079.29 కోట్లు రైల్వే మంత్రిత్వ శాఖ రూపొందించిన ఎ బి ఎస్ ఎస్ విధానంలో భాగంగా రైల్వే స్టేషన్లను ఆధునీకరించడం, దీర్ఘకాలిక దృష్టితో నిరంతర ప్రాతిపదికన అభివృద్ధిని సాధించాలనే లక్ష్యంగా పెట్టుకుందని రాకేష్ తెలిపారు. ఈ ఆలోచన ఎప్పటికప్పుడు పెరుగుతున్న అవసరాలకు మరియు రైల్వే స్టేషన్లలో మాస్టర్ ప్లాన్ ప్రకారం పెంచే విదంగా వివిధ కీలక అంశాల అమలుపై ఆధారపడిందని ఆయన తెలిపారు. భారత ప్రభుత్వం ప్రారంభించిన అమృత్ భారత్ స్టేషన్ పథకం కింద, దేశవ్యాప్తంగా రైల్వే స్టేషన్లు అత్యాధునిక సౌకర్యాలతో పునర్నిర్మించబడుతున్నాయని, భారతీయ వైవిధ్యం యొక్క గొప్పతనాన్ని ప్రదర్శిస్తూ, ఈ పునఃఅభివృద్ధి చేయబడిన స్టేషన్లు నూతన అత్యాధునిక ప్రయాణీకుల సౌకర్యాలతో పాటు ప్రస్తుత సౌకర్యాలను మెరుగుపరచడం మరియు పూర్తి చేయడం జరుగుతుందని ఆయన తెలిపారు.

# స్మార్ట్ కిడ్జ్ లో ఘనంగా స్నేహితుల దినోత్సవం





**ఖమ్మం, ఆగష్టు 5(మనం న్యూస్) :** స్థానిక స్మార్ట్ కిడ్జ్ పాఠశాలలో శనివారం స్నేహితుల దినోత్సవాన్ని సంబురంగా నిర్వహించారు. పాఠశాల చిన్నారులు తమ మిత్రుల ముంజేతికి ఫ్రెండ్షిప్ బ్యాండ్ కట్టి తమ ఆత్మీయతను పంచుకున్నారు. తమ మిత్రులకు ఒకరికొకరు మిఠాయిలు తినిపించుకుంటూ ఆలింగనం చేసుకున్నారు. మిత్రులంతా తమ చేతికి కట్టిన ఫ్రెండ్షిప్ బ్యాండ్లతో నృత్యాలు చేస్తూ వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ చింతనిప్పు కృష్ణచైతన్య మాట్లాడుతూ చిన్నతనంలో ఏర్పడిన స్నేహభావం కలకాలం నిలిచి ఉంటుందని తెలిపారు. స్నేహ మాధుర్యం విశిష్టతను తెలియజేసేందుకే తమ పాఠశాలలో స్నేహితుల దినోత్సవాన్ని నిర్వహించామన్నారు. విద్యార్థుల మధ్య సహకారం, సమిష్టి భావం పెంపొందడానికి స్నేహభావం దోహదపడుతుందని తెలిపారు. ప్రతి ఒక్కరూ స్నేహబంధాన్ని చిరకాలం కొనసాగించాలని కృష్ణ చైతన్య కోరారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# ఖమ్మం గ్రానైట్ పరిశ్రమలకు రూ.22 కోట్ల బకాయిలు విడుదల

**– సీఎం కేసీఆర్, మంత్రులు కేటీఆర్, హరీష్, పువ్వాడలకు కృతజ్ఞతలు**

**– పరిశ్రమను ఆదుకున్నందుకు ధన్యవాదాలు : ఎంపీ రవిచంద్ర**



**ఖమ్మం, ఆగస్ట్, 5(మనం బ్యూరో) :** ఖమ్మం గ్రానైట్ పరిశ్రమలకు ప్రభుత్వం బకాయి ఉన్న పలు సబ్సిడీలను శనివారం విడుదల చేసింది. ఇండస్ట్రీస్ ఇన్సెంటివ్, పవర్ సబ్సిడీ, పావలావడ్డీ బకాయిలు కలిపి.. ప్రభుత్వం రూ. 22 కోట్లు విడుదల చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. గ్రానైట్ పరిశ్రమకు ప్రభుత్వం నుంచి 2014 నుంచి పలు రకాల రాయితీ బకాయిలు పెండింగ్లో ఉన్నాయి. వీటిని విడుదల చేసి పరిశ్రమను ఆదుకోవాలని ఖమ్మం గ్రానైట్ అసోసియేషన్ ప్రతినిధులు రాజ్యసభ ఎంపీ వద్దిరాజు రవిచంద్ర నేతృత్వంలో పలుమార్లు సీఎం కేసీఆర్, మంత్రులు కేటీఆర్, హరీష్ రావు, పువ్వాడ అజయ్ కుమార్ లకు విజ్ఞప్తులు అందించారు. ఈ ఏడాది జనవరి 18 న ఖమ్మంలో బీఆర్ఎస్ పార్టీ ఆవిర్భావ బహిరంగ సభ సందర్భంగా కూడా అసోసియేషన్ ప్రతినిధులను ఎంపీ రవిచంద్ర దగ్గరుండీ మంత్రి హరీష్ రావు ను కలిపించి.. సమస్య తీవ్రతను తెలియజేశారు. ఆనాడు హరీష్ రావు స్వయంగా బకాయిల విడుదలకు హామీ ఇచ్చారు. ఆ మేరకు బకాయిల మొత్తంలో రూ. 22 కోట్లు మంజూరు చేస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు ఉత్తర్వులు విడుదల చేసింది.

రుణపడి ఉంటాము: ఎంపీ వద్దిరాజు గ్రానైట్ పరిశ్రమకు ప్రభుత్వం నుంచి రావాల్సిన పలు రాయితీ బకాయిలు మంజూరైన నేపథ్యంలో రాజ్యసభ ఎంపీ వద్దిరాజు రవిచంద్ర హర్షం వ్యక్తం చేశారు. ఖమ్మం గ్రానైట్ కుటుంబ సభ్యులందరూ సీఎం కేసీఆర్ గారికి రుణపడి ఉంటారని అన్నారు. తెలంగాణలో అతి ముఖ్యమైన గ్రానైట్ పరిశ్రమను ఆదుకోవాలని కోరిన నేపథ్యంలో.. సీఎం కేసీఆర్ పెద్ద మనసుతో స్పందించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. మంత్రులు కేటీఆర్, హరీష్ రావు, పువ్వాడ అజయ్ కుమార్ లు కూడా పరిశ్రమను ఆదుకోవడంలో అండగా నిలిచారని.. వారితో పాటు సహకరించిన జిల్లా ఎంపీలు, ఎమ్మెల్యేలకు రవిచంద్ర ధన్యవాదాలు తెలిపారు.

# ఇంటింటా ఇన్నోవేటర్ ఆవిష్కరణల సమర్పణ గడువు పొడిగింపు

**ఖమ్మం, ఆగస్టు 5(మనం న్యూస్) :** ఇంటింటా ఇన్నోవేటర్ ఆవిష్కరణల సమర్పణ గడువు ఈ నెల 10 వరకు పొడిగించినట్లు తెలంగాణ రాష్ట్ర ఇన్నోవేషన్ సెల్ తెలిపింది. నూతన ఆవిష్కరణల వివరాలను వాట్సప్ ద్వారా పంపాల్సి ఉంటుంది. ప్రస్తుత సంవత్సరానికి గ్రామీణ, పట్టణ ఔత్సాహికులు ఆవిష్కరణలలో తమ ప్రతిభను చాటుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం గత ఐదేళ్లుగా ఇంటింటా ఇన్నోవేషన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నది. ప్రతి సంవత్సరం జరిగే స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా పలు ఆవిష్కరణల ప్రదర్శనలు నిర్వహిస్తారు. ఇందులో భాగంగా గ్రామీణ ఆవిష్కరణ, విద్యార్థుల ఆవిష్కరణ, వ్యవసాయ రంగ ఆవిష్కరణలు, సూక్ష్మ, చిన్న తరహా పరిశ్రమల ఆవిష్కరణలు తదితర అంశాలు ఇందులో ప్రదర్శించవచ్చిన, వాటికి సంబంధించిన ప్రదర్శనకు గల రెండు నిమిషాల వీడియో, ఆవిష్కరణ నాలుగు ఫోటోలు, ఆరు వ్యాఖ్యలతో ఆసక్తి గల వారు 9100678543 నెంబర్కు వాట్సప్ ద్వారా వృత్తి, ఊరి పేరు, జిల్లా పేరుతో వివరాలను పంపించాలన్నారు. ఆవిష్కరణలు ఆగస్టు 10 లోగా పంపాల్సి ఉంటుంది.




# ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి




**ఖమ్మం, ఆగస్టు 5(మనం న్యూస్) :** ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ప్రభుత్వ యునాని వైద్యాధికారి డా. శంకర్ అన్నారు. స్థానిక స్తంభానినగర్ లో శనివారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించినట్లు ఆయన తెలిపారు. సీజనల్ వ్యాధులు జ్వరం, దగ్గు, జలుబు కు యునాని వైద్యంతో మంచి ఫలితాలు వస్తాయని ఆయన తెలిపారు. శనివారం చేపట్టిన వైద్య శిబిరంలో 230 మంది చికిత్స పొందినట్లు వైద్యాధికారి అన్నారు.

# దరఖాస్తు చేసుకున్న బీసీలందరికీ రుణాలు ఇవ్వాలి

**బిసి జెఏసి పాలేరు నియోజకవర్గ అధ్యక్షులు పాగర్తి సుధాకర్ డిమాండ్**



**నేలకొండపల్లి, ఆగష్టు 5(మనం న్యూస్) :** రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న బీసీలందరికీ ప్రభుత్వం తక్షణమే రుణాలు మంజూరు చేయాలని బీసీ జేఏసీ పాలేరు నియోజకవర్గ అధ్యక్షులు పాగర్తి సుధాకర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం మండలంలోని కొత్త కొత్తూరు గ్రామంలో బీసీ జేఏసీ మండల కమిటీ సమావేశం దేవరశెట్టి రాము అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ బీసీల సంక్షేమం పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని మండిపడ్డారు. పాలేరు నియోజకవర్గ కేంద్రంలో బీసీ భవనాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. అనంతరం బీసీ జేఏసీ మండల నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా తోగాటి నాగచారి, ప్రధాన కార్యదర్శిగా పిట్టల సూరిబాబు, ఉపాధ్యక్షులుగా జడ కోటేశ్వరరావు, తుడిమల్ల ఉపేంద్రచారి, సహాయ కార్యదర్శిగా బండి బ్రహ్మంను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు ఈ కార్యక్రమంలో బీజేపీ మైనారిటీ మోర్చా మండల అధ్యక్షులు సయ్యద్ మోహినుద్దీన్, బిసి జెఏసి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# గాంధీభవన్ లో సంబరాలు

**పాల్గొన్న టిపిసిసి అధికార ప్రతినిధి మద్ది శ్రీనివాసరెడ్డి**



**తిరుమలాయపాలెం, ఆగస్టు 5 (మనం న్యూస్):** రాహుల్ గాంధీ ఎంపీ సభ్యత్వం సుప్రీం కోర్ట్ పునరుద్దరించటంతో , గాంధీభవన్ లో టీపీసీసీ ఇంచార్జి మాణిక్ రావు థాక్రే ఆధ్వర్యంలో జరిగిన సంబరాల్లో జిల్లాకు చెందిన టిపిసిసి అధికార ప్రతినిధి మద్ది శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు. ఇది అధర్మం పై సాధించిన విజయం అన్నారు. ఈ సందర్భంగా రాహుల్ గాంధీ చిత్ర పటానికి పాలాభిషేకం చేశారు.

# చంద్రబాబుపై దాడి ని ఖండించిన టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు కొండబాల



**తిరుమలాయపాలెం, ఆగస్టు 5 (మనం న్యూస్) :** ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో చిత్తూరు జిల్లాలో పర్యటిస్తున్న మాజీ ముఖ్యమంత్రి తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు పై వైసీపీ కిరాయి గుండాలు రాళ్లతో దాడి చేయడాన్ని తెలుగుదేశం పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు కొండబాల కరుణాకర్ తీవ్రంగా ఖండించారు. శనివారం మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీకి రోజురోజుకీ ప్రజల్లో పెరుగుతున్న ఆదరణ చూసి 2024 లో అధికారం కోల్పోతామని భయంతో వైకాపా నేతలు కిరాయి గుండాలతో తెలుగుదేశం పార్టీ శ్రేణులపై దాడులకు పాల్పడుతున్నారని తెలిపారు. దాడి చేయడం హేయమైన చర్య అని, ప్రజాస్వామ్యంలో ఎవరైనా ఎక్కడైనా సభలు నిర్వహించుకోవచ్చు అని, ఇలాంటి దాడులను తెలుగుదేశం పార్టీ తీవ్రంగా ఖండిస్తుందని ఆయన అన్నారు.

# ఎమ్మెల్సీ కవితను మర్యాదపూర్వకంగా కలిసిన సొసైటీ వైస్ చైర్మన్ చామకూరి రాజు



**తిరుమలాయపాలెం, ఆగస్టు 5 (మనం న్యూస్) :** శనివారం శాసనమండలి సమావేశంలో భాగంగా మండలి ప్రాంగణంలో గౌరవ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ను, ఎమ్మెల్సీ ఖమ్మం జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు తాతా మధుసూదన్ ను తిరుమలాయపాలెం సొసైటీ వైస్ చైర్మన్ చామకూరి రాజు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పిండిప్రోలు గ్రామంలో సిసి రోడ్లు, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అదనపు గదులు నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని వారికి వినతిపత్రం అందించారు.

## జెడ్పీ ఛైర్మన్ పర్యటన



**బోనకల్, ఆగష్టు 5(మనం న్యూస్) :** బోనకల్ మండలంలో జిల్లా పరిషత్ ఛైర్మన్ లింగాల కమల్ రాజు శనివారం పర్యటించారు. తొలుత బోనకల్ ప్రభుత్వ పాఠశాలలో జరుగుతున్న తొలిమెట్టు కార్యక్రమానికి హాజరై ఉపాధ్యాయులను ఉద్దేశించి ప్రసంగించారు. అనంతరం మధ్యాహ్న భోజనం చేస్తున్నటువంటి విద్యార్థుల వద్దకు వెళ్లి భోజనం, స్కూల్ వసతులు ఏ విధంగా ఉన్నాయో అడిగి తెలుసుకున్నారు. అనంతరం జానకిపురం గ్రామంలో బిఆర్ఎస్ యువజన నాయకుడు కోట శ్రీకాంత్ తండ్రి కోట రోషయ్య దశదిన ఖర్మకు హాజరై వారి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు బిఆర్ఎస్ ముఖ్య నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## చంద్రబాబుపై దాడికి టిడిపి ఖండన



**బోనకల్, ఆగష్టు 5(మనం న్యూస్) :** చిత్తూరు జిల్లాలో పర్యటిస్తున్న తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు పై వైసీపీ కిరాయి గుండాలు రాళ్లతో దాడి చేయడాన్ని బోనకల్ మండల కమిటీ తీవ్రంగా ఖండించింది. శనివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో టిడిపి మండల కన్వీనర్ రావుట్ల సత్యనారాయణ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీకి రోజురోజుకీ ప్రజల్లో పెరుగుతున్న ఆదరణ చూసి 2024 లో అధికారం కోల్పోతామని భయంతో వైకాపా నేతలు కిరాయి గుండాలతో దాడులకు పాల్పడుతున్నారని ఆరోపించారు. దాడి చేయడం హేయమైన చర్య అని, ప్రజాస్వామ్యంలో ఎవరైనా ఎక్కడైనా సభలు నిర్వహించుకోవచ్చు అని, ఇలాంటి దాడులను తెలుగుదేశం పార్టీ తీవ్రంగా ఖండిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం పార్లమెంటరీ అధ్యక్షులు నందమూరి సత్యనారాయణ, మండల తేదేపా నాయకులు మరీదు బరకయ్య తూము పురుషోత్తం ఏసు పోగు నాగేశ్వరరావు ,మండేపూడి గోర్కే తదితరులు పాల్గొన్నారు

## ఘనంగా బోడేపూడి వర్ధంతి



**బోనకల్, ఆగష్టు 5(మనం న్యూస్) :** బోనకల్‌లోని సిపిఎం కార్యాలయంలో మాజీ శాసనసభ్యులు, రైతు ఉద్యమ నాయకులు బోడెపుడి వెంకటేశ్వరరావు 26వ వర్ధంతి శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బోడిపూడి చిత్రపటానికి సిపిఎం బోనకల్ జోనల్ కన్వీనర్ గుగులోత్ పంతు, రావినూతల రెండో శాఖ కార్యదర్శి డాక్టర్ గోపి పూలమాలలు వేసి జోహార్లు అర్పించారు .తదనంతరం సిపిఎం మండల కార్యదర్శి దొండపాటి నాగేశ్వరావు మాట్లాడుతూ వీర తెలంగాణ సాయుధ పోరా ఉద్యమంలో రైతుల కోసం, వ్యవసాయ కూలీల కోసం పోరాటాలు నిర్వహించి , మధిర నియోజకవర్గంలో ప్రజల దాహార్తి తీర్చడానికి వైరా రిజర్వాయర్ నందు బోడెపుడి సుజల స్రవంతిని సాధించిన మహనీయుడని అన్నారు. మధిర నియోజకవర్గం అభివృద్ధిలో ఎనలేని కృషి చేశారన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కమిటీ సభ్యులు పిల్లలమర్రి అప్పారావు, గుగులోతు నరేష్, సిపిఎం నాయకులు మచ్చ గురవయ్య, కొమ్మినేని పిచ్చయ్య ,రైతు సంఘం నాయకులు జోనేబోయిన గురవయ్య, కెవిపిఎస్ మండల నాయకులు ఏసు పోగు బాబు , బానోతు స్వామి తదితరులు పాల్గొన్నారు.

## కోట రోశయ్యకు బొమ్మెర నివాళి



**బోనకల్, ఆగష్టు 5(మనం న్యూస్) :** మండలంలోని జానకిపురం గ్రామం లో బిఆర్ఎస్ పార్టీ బోనకల్ మండల యువజన విభాగం మండల కార్యదర్శి కోట శ్రీకాంత్ తండ్రి కోట రోశయ్య దశదిన కర్మకు బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు, మధిర నియోజకవర్గ మాజీ ఇంచార్జి బొమ్మెర రామ్మూర్తి హాజరై నివాళులర్పించారు. ఈ కార్యక్రమం లో గ్రామ సర్పంచ్ చిలుక వెంకటేశ్వర్లు, రాయన్నపేట సర్పంచ్ కిన్నెర పాపారావు, పెదగోపవరం సర్పంచ్ ఇనపనూరి శివాజీ, మధిర నియోజకవర్గ ఇంచార్జి కోట హనుమంతురావు జాగృతి ఇంచార్జి బొబ్బిళ్లపాటి బాబురావు, పగిడిపల్లి వినోద్, చింతెటి సురేష్, చిలుక నరేష్, బొల్లిపోగు రామారావు, తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ చైతన్య లో స్మార్ట్ లివింగ్ ప్రోగ్రాం



**మధిర, ఆగస్ట్ 5(మనం న్యూస్):** స్థానిక పట్టణంలోని శ్రీ చైతన్య స్కూల్ నందు స్మార్ట్ లివింగ్ ప్రోగ్రాం లో భాగంగా విద్యార్థులు హరితభారత్ అనే అంశం మీద కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు కాలాను గునంగా పెరిగే మొక్కలను మానవ జీవనానికి అవసరమైనటువంటి మొక్కలను స్కూలు ఆవరణలో నాటారు. హరిత భారత్ అనే అంశం మీద వ్యాసరచన, చిత్రలేఖనం, క్విజ్ వంటి వివిధ కేటగిరీలలో విద్యార్థులకు పోటీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఆకెళ్ళ భారతి మాట్లాడుతూ విద్యార్థులను స్కూల్ దశనించే ఉత్తమ పౌరులుగా సమాజం పట్ల బాధ్యతగా వ్యవహరించాలని ఉద్దేశంతో శ్రీ చైతన్య కర్కులంలో హరితభారత్ స్మార్ట్ లివింగ్ ప్రోగ్రాంని పొందుపరచటం జరిగిందని వివరించారు. ఈ కార్యక్రమంలో డీజిఎం చేతన్ ఆర్ఐ జయప్రకాష్ ,జోనల్ అకాడమిక్ కోఆర్డినేటర్ కృష్ణారావు , డీన్ నరేష్, సి బ్యాచ్ ఇంచార్జ్ కోట తిరుపతి రావు , స్మార్ట్ లివింగ్ ప్రోగ్రాం ఇంచార్జ్ బివి రత్నం , ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు ,విద్యార్థులు పాల్గొన్నారు.





## చట్టాల పై అవగాహన కలిగి ఉండాలి : హ్యూమన్ రైట్స్ ఫౌండేషన్

**బోనకల్, ఆగష్టు 5(మనం న్యూస్) :** బోనకల్ కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం నందు హ్యూమన్ రైట్స్ ఫౌండేషన్ మధిర డివిజన్ అధ్యక్షులు కోట వెంకట్ ఆధ్వర్యంలో మానవ హక్కుల చట్టాలపై, పోక్సో యాక్ట్ పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి అతిథులుగా రాష్ట్ర కోఆర్డినేటర్ యం. నిస్సిజిల్లా అడ్వైసర్ యం.యశోద, మధిర డివిజన్ వైస్ ప్రెసిడెంట్ కె.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. కళాశాల ఇంచార్జీ శైలజ, ఉపాధ్యాయులు మాట్లాడుతూ మానవ హక్కులు, ఫోక్సొ ఆక్ట్ 2012, పర్యావరణ పరిరక్షణ, తదితర చట్టాల పై విద్యార్థినిలకు అవగాహన కల్పించిన హ్యూమన్ రైట్స్ ఫౌండేషన్‌ని అభినందించారు.

## ప్రజలకు ఆరోగ్య సేవలు అందించటం మహాభాగ్యం

### సర్పంచ్ దంపతులు కోట విజయశాంతి వెంకటకృష్ణ





**మధిర, ఆగస్ట్ 5(మనం న్యూస్) :** పిహెచ్సి దెందుకూరు వైద్యులు, పారా మెడికల్ సిబ్బంది ఆధ్వర్యంలో గతంలో బదిలీ, ప్రమోషన్ మీద ఇతర జిల్లాలకు పీహెచ్సీ దెందుకురు లో పని చేసి వెళ్లిన వైద్యులు డా. టీ నాగరాజు, డా. శషిదర్ సి హెచ్ ఒ గోలి రమాదేవి యూడీసీ మమత డి పి ఎమ్ ఓ భద్రు కు సర్పంచ్ దంపతులు కోట విజయశాంతి వెంకట్ కృష్ణ, ఎంపీటీసీ దంపతులు అల్లు రమాదేవి అంకు బాబు ఆధ్వర్యంలో ఘనంగా సన్మాన చేసి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పిహెచ్సి వైద్య సిబ్బంది బస్తీ దవఖాన వైద్య సిబ్బంది ఆశ కార్యకర్తలు గ్రామ ప్రజలు సన్మాన గ్రహీతలు వైద్యులు డా. వెంకటేష్ డా. వీర బాబు డా.వెంకట్, లాల్ పాల్గొన్నారు.



## తల్లిపాలపై ఇంటింటికి అవగాహన కల్పిస్తున్న అంగన్వాడీలు

**వైరా, ఆగష్టు 05(మనం న్యూస్) :** మండలంలోని ఆగస్టు ఒకటి నుండి ప్రారంభమైన ప్రపంచ తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా శనివారం రెబ్బవరం, జింకలగూడెం, ఖానాపురం గ్రామాల్లో ఏసిడిపిఓ ధనమ్మ ఆధ్వర్యంలో అంగన్వాడీ టీచర్లు ఇంటింటికి తిరుగుతూ గర్భిణీలకు బాలింతలకు తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు గర్భిణీ సమయంలో తీసుకోవాల్సిన ఆహారం గురించి,ప్రసవించే సమయంలో తీసుకోవలసిన జాగ్రత్తలు ప్రసవించిన తర్వాత గంటలోపు వీలైనంత త్వరగా శిశువులకు పట్టించే ముర్రుపాలపై తగిన సూచనలు సలహాలు చేశారు. అనంతరం ఖానాపురం అంగన్వాడీ కేంద్రంలో సూపర్వైజర్ బీజాన్బి చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు.ఈ కార్యక్రమంలో సంబంధిత గ్రామాల పంచాయతీ కార్యదర్శులు వేణు,సూపర్వైజర్లు మాలతి కుమారి, సంబంధిత గ్రామాల అంగన్వాడి టీచర్లు రోహిణి,పాపగంటి అరుణ, అన్నపూర్ణ,భాగ్యలక్ష్మి,మైబూ, ఏఎన్ఎంలు ఆశ వర్కర్లు గర్భిణీలు బాలింతలు పిల్లల తల్లులు పాల్గొన్నారు.

## తల్లిపాల వారోత్సవాల సందర్భంగా అన్నప్రాసన

**మధిర, ఆగస్ట్ 5 (మనం న్యూస్):** మధిర మండలంలోని డేశినేని పాలెం గ్రామంలో అంగన్వాడి టీచర్ల ఆధ్వర్యంలో పాఠశాల విద్యార్థులకు తల్లిపాల వారోత్సవాలను పురస్కరించుకొని అన్నప్రాసన నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయితీ సర్పంచ్ అవుల ఝాన్సి మాట్లాడుతూ పిల్లలకు పోస్టికాహారం ప్రాముఖ్యత అందరూ తెలుసుకోవాలని, తల్లిపాల తో పాటు బిడ్డకు పోస్టికాహారం వ్యాది నిరోధకశక్తి పెరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్స్ మల్లెల స్వర్ణ , కళావతి మరియు పిల్లల తల్లి తండ్రులు పాల్గొన్నారు.



# తల్లి పాలతోనే బిడ్డకు సంపూర్ణ ఆరోగ్యం

## ఐసిడిఎస్ సిడిపిఓ కృష్ణకుమారి



**కల్లూరు, ఆగష్టు 05(మనం న్యూస్):** తల్లిపాలతోనే బిడ్డకు సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని ఐసిడిఎస్ సిడిపిఓ కృష్ణకుమారి అన్నారు. మండల పరిధిలోని చుండ్రుపట్ల అంగన్వాడి కేంద్రంలో చంద్రుపట్ల సెక్టార్ సూపర్వైజర్ జొన్నలగడ్డ సుజాత ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన తల్లిపాల వారోత్సవాలలో సిడిపిఓ కృష్ణకుమారి మాట్లాడుతూ తల్లిపాల ప్రాధాన్యత గురించి తల్లులకు క్షేత్రస్థాయిలో తెలియజేసి , బిడ్డ పుట్టిన గంటలోపే ముర్రుపాలు పట్టించాలని, తల్లిపాలతో సరి సమానంగా పోషక విలువలు కలిగిన ఆహారమే లేదని అందువలన ప్రతి ఒక్కరూ ఈ విషయాన్ని గుర్తుంచుకొని పిల్లలకు తల్లిపాలు తప్పనిసరిగా అందించాలన్నారు. గర్భిణీగా ఉన్నప్పటి నుంచే మంచి పోషక విలువలు కలిగిన ఆహారాన్ని తీసుకున్నట్లయితే పుట్టబోయే బిడ్డకు సమృద్ధిగా పాలను ఇవ్వగలుగుతారని, సుఖ ప్రసవం అవుతారన్నారు. ప్రభుత్వం గర్భిణీలకు, బాలింతలకు, చిన్నారులకు అంగన్వాడీ కేంద్రాల ద్వారా అందించే పోషక విలువలు కలిగిన ఆహారాన్ని తీసుకోవడంతోపాటు వారిచ్చే సలహాలు సూచనలు పాటించినట్లయితే తల్లి పుట్టబోయే బిడ్డ సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉంటారన్నారు. మహిళల సంక్షేమం కోసం ప్రభుత్వం ఎన్నో పథకాలను తీసుకువచ్చిందని , మహిళా శిశు సంక్షేమ శాఖ ద్వారా అందిస్తున్న పథకాలను అందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు.అనంతరం ర్యాలీ నిర్వహించి గర్భిణీ బాలింతల గృహాలను సందర్శించి గర్భిణీగా గుర్తించిన దగ్గరనుంచి తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్స్ ఝాన్సీ, లక్ష్మి ,కమల తల్లులు తదితరులు పాల్గొన్నారు.

# కప్పలబంధంలో సామూహిక సీమంతాలు



**కల్లూరు, ఆగష్టు 05(మనం న్యూస్):** తల్లిపాలు వారోత్సవాల కార్యక్రమంలో భాగంగా కప్పల బంధం అంగన్వాడి కేంద్రంలో సామూహిక సీమంతాలను అంగన్వాడి ఏసి డిపిఓ, సర్పంచ్ నందిగామ ప్రసాద్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. శనివారం మండల పరిధిలోని కప్పల బంధం గ్రామ పంచాయతీలోని అంగన్వాడి కేంద్రం నందు తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా ఏసి డిపిఓ రత్తమ్మ మాట్లాడుతూ తల్లిపాలు ఎంతో శ్రేష్టమైనవని, వాటిని తప్పనిసరిగా పిల్లలకు పట్టే విధంగా ప్రతి ఒక్క తల్లి సహకరించి పిల్లలకు తల్లిపాలే తాగించాలని సూచించారు. డబ్బా పాలు వద్దంటూ ఆమె సూచించారు. పౌష్టికాహారానికి నిలయమే తల్లిపాలని ,గర్భిణీ దగ్గర నుండి బాలింత వరకు అంగన్వాడీ కేంద్రంలో పౌష్టిక ఆహార పదార్థాలు అందించడం జరుగుతుందని ,వాటిని వినియోగించుకొని తల్లులు బిడ్డలకు మంచి ఆహారాన్ని అందించే దిశగా ముందుండాలని ఆమె అన్నారు. అనంతరం గ్రామంలోని గర్భిణీల అందరికీ సీమంత కార్యక్రమాలను చేపట్టారు. ఈ కార్యక్రమంలో పేరువంచ సెక్టార్ సూపర్వైజర్ భవాని, కప్పల బంధం ప్రాథమిక పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు బీరవల్లి శ్రీనివాసరావు, టీచర్లు సిహెచ్ భారతి, వై హెలినా, జి భవాని, ఆయాలు ఉబ్బన నవ్య, దీపిక ఏఎన్ఎం ఆశాలు, గర్భిణులు, బాలింతలు, తదితరులు పాల్గొన్నారు.

# అన్నారుగూడెంలో తల్లీ పాల వారోత్సవాలు



**తల్లాడ, ఆగస్టు 5( మనం న్యూస్):** తల్లాడ మండల పరిధిలో అన్నారుగూడెం ప్రాంతాలలో నాల్గవ కేంద్రము నందు తల్లీ పాల ఉపయోగ వారోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. తల్లీ మొదటి పాల ప్రాముఖ్యత, తీసుకోవలసిన పౌస్టిక తాజా ఆహారం, తృణ ధాన్యాలు, శరీరానికి శక్తి సామర్థ్యం పెంపొందించే వేడి వేడి ఆహార పదార్థాలు, ఆకు కూరల ప్రాముఖ్యత పాటించవలసిన నియమ నిబంధనలు వివరించారు. వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరైన గ్రామ ప్రథమ పౌరురాలు మారెళ్ళ మమత మాట్లాడుతూ కొందరు మహిళలు మొదటిగా లభించిన పాలు బిడ్డకు పట్టవద్దు అంటూ పురాతన నిర్ణయాలు ఆచారాలు మూడ నమ్మకాలు పాటిస్తారని, అటువంటి మూఢ నమ్మకాలను ఆచరించకూడదని, ఆరునెలలు వరకు తల్లీ పాలనే అందించి స్థానిక అంగన్వాడీ ఉపాధ్యాయుల సూచనలు సలహాలు మాత్రమే నిత్యం అనుచరించాలని వివరించారు. అనంతరం సీమంతాలు, అన్నప్రాసనలు, ఘనంగా నిర్వంహించి హాజరైన గర్భిణీ బాలింతలకు చిరు కానుకలు అందించి ప్రోత్సాహించారు. ఈ కార్యక్రమంలో సూపర్ వైజర్ యమ్ డి, హాభీ మున్నిషా బేగం, పల్లే దవా ఖాన వైద్యులు గోపీ, పరిది అంగన్వాడి ఉపాధ్యాయులు. అషా కార్యకర్తలు, చిన్నారుల పాల తల్లులు.గర్భిణీలు, సామాజిక కార్యకర్తలు పాల్గొన్నారు.

# మంచినీటి ట్యాంక్ ఎక్కి పంచాయతీ కార్మికుల కార్మికుల నిరసన



**దమ్మపేట, ఆగష్టు 5(మనం న్యూస్) :** దమ్మపేట మండలం లోనిగ్రామపంచాయతీ కార్మికుల 31వ రోజు సమ్మెలో భాగంగా శనివారం మంచి నీటి ట్యాంకులెక్కి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పంచాయతీ కార్మికులు పస్తులతో సమ్మె చేస్తుంటే ఈ ప్రభుత్వం పట్టించుకోవటం లేదని, ఇప్పటికైనా స్పందించాలని కోరారు. కార్మిక కుటుంబాల ఉసురు ప్రభుత్వానికి తగిలి నశించి పోతుందని ఆవేదన చేశారు. గ్రామ పంచాయతీ కార్మికులు కూడా ప్రాణాలు విడవాలా అని ప్రశ్నించారు. తమ శవాల మీద కేసీఆర్ పాలన చేయాలని చూస్తున్నాడని విమర్శించారు. తాము పస్తులతో దౌర్భాగ్య జీవితం గడుపుతుంటే ప్రభుత్వానికి చీమకుట్టినట్లయినా లేదని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో 31 గ్రామ పంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.

# తుమ్మలను కలిసిన లింగాలపల్లి రైతులు

## – నూతన పాస్ పుస్తకాలు అందలేదని ఆవేదన

## – కలెక్టర్ తో మాట్లాడి ఇప్పిస్తానని హామీ



**దమ్మపేట, ఆగష్టు 5(మనం న్యూస్) :** మండలంలోని లింగాలపల్లి రైతులు శనివారం ఉదయం గండుగులపల్లి లోని మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావును మన్యం అప్పారావు, ఊకే చంద్రరావు ఆధ్వర్యంలో కలిశారు. దమ్మపేట రెవెన్యూ మోజాలోని 1458 సర్వే నంబర్ లో గల భూములకు నూతన పాస్ పుస్తకాలు అందకపోవడంతో ప్రభుత్వం నుంచి వచ్చే సబ్సిడీ పథకాలు, రైతుబంధు అందుకోలేకపోతున్నామని తుమ్మలకు రైతులు వివరించారు. ఆ సర్వే నంబర్లో గల భూములకు పాస్ పుస్తకాలు ఇప్పించాలని కోరారు. స్పందించిన తుమ్మల మాట్లాడుతూ కలెక్టర్‌తో మాట్లాడి పాస్ పుస్తకాలు వచ్చే విధంగా చూస్తానని హామీ ఇచ్చారు.

# హరితహారం మొక్కలు పంపిణీ

## పాల్గొన్న ఎంపీపీ జల్లిపల్లి



**అశ్వారావుపేట టౌన్, ఆగష్టు 05(మనం న్యూస్ ):** అశ్వారావుపేట మండలం గ్రామపంచాయతీ పరిధిలో హరితహారం మొక్కలు పంపిణీ కార్యక్రమంలో భాగంగా ప్రతి ఇంటికి 6 మొక్కల పంపిణీని ఎంపీపీ జల్లిపల్లి శ్రీరామమూర్తి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన అశ్వారావుపేట మండలంలో మొత్తం సుమారు మూడు లక్షల మొక్కలను పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ప్రతి ఇంటికి ఆరు మొక్కలు పంపిణీ చేస్తామన్నారు. మొక్కలు నాటడం చేయడం వలన మన తెలంగాణలో 7.3% గ్రీనరీ అడవులు పెరిగాయని, ముందు ముందు మారుతున్న వాతావరణ లకు అనుగుణంగా మనం అడవులను పెంచుకోవడం వలన ఆక్సిజన్ కొరత లేకుండా ఎటువంటి ఇబ్బంది లేకుండా పర్యావరణాన్ని కాపాడుకావచ్చని అన్నారు. ప్రతి ఒక్కరూ పాల్గొని మొక్కలు నాటి వాటిని కాపాడాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఈవో హరికృష్ణ, ఫీల్ అసిస్టెంట్లు వేంకటేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.

# మానవత్వం చూపిన గోల్డ్ షాప్స్ యాజమాన్యం

## పంచాయతీ కార్మికులకు అన్నదానం



**అశ్వారావుపేట టౌన్, ఆగష్టు 05(మనం న్యూస్ ) :** పట్టణంలోని గోల్డ్ షాప్స్ యజమానులు మానవత్వం చూపారు. పట్టణంలోని రింగ్ రోడ్డు కూడలిలో గత 31రోజులుగా సమ్మె చేస్తున్న గ్రామపంచాయతీ కార్మికులకు అశ్వారావుపేట బులియన్ మార్కెట్ యూనియన్ ఆధ్వర్యంలో శనివారం సమ్మె శిబిరం వద్ద అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. మండలోని 30 గ్రామపంచాయతీ లకు సంబంధించి సుమారు 200 మంది గ్రామపంచాయతీ కార్మికులకు భోజనాలను ఏర్పాటు చేశారు. ఇందుకు గాను మండల గ్రామ పంచాయతీ కార్మికుల జేఏసీ తరపున వారికి కృతజ్ఞతలు తెలియజేశారు

# ప్రతి ఖాతాదారుడు ఇన్సూరెన్స్ కలిగి ఉండాలి

## ఎంపీపీ దొడ్డ శ్రీనివాసరావు



**తల్లాడ, ఆగష్టు 5,( మనం న్యూస్):** బ్యాంకు ఖాతాదారులు అందరూ బ్యాంకు నుండి ఇస్తున్న ఇన్సూరెన్స్ అందరూ జాయిన్ కావాలని ఎంపీపీ దొడ్డ శ్రీనివాసరావు అన్నారు. శనివారం తల్లాడ ఏపీజీవీబీ బ్యాంకులో అన్నారుగూడెం గ్రామానికి చెందిన సాంబత్తిని లక్ష్మి ఇటీవల అనారోగ్యంతో మరణించగా ఆమెకు బ్యాంకులో ప్రధానమంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన కింద రెండు లక్షల రూపాయలు చెక్కును ఎంపీపీ దొడ్డ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో బ్యాంకు అధికారులు నామినీగా ఉన్న సాంబత్తిని బాలస్వామికి చెక్కులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏపీజీవీబీ బ్యాంక్ మేనేజర్ శివ సతీష్ క్యాషియర్ రవికుమార్ అకౌంటెంట్ భాగ్య బ్యాంకు మిత్ర తాళ్లూరి వెంకటరమణ తదితరులు హాజరయ్యారు.

# పోలీసుల ఆధ్వర్యంలో డిస్ట్రిక్ట్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ (డిడిఆర్ఎఫ్) ఏర్పాటు

## – జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ జి





**భద్రాద్రి కొత్తగూడెం, ఆగస్ట్ 5 (మనం ప్రతినిధి) :** వరదలు, అగ్ని ప్రమాదాలు, ఇతర ప్రకృతి వైపరీత్యాలు సంభవించినపుడు విపత్కర పరిస్థితులలో సహాయ సహకారాలు అందించడానికి జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో డిస్ట్రిక్ట్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్(డిడిఆర్ఎఫ్) బృందాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ జి వెల్లడించారు. అకస్మాత్తుగా సంభవించే ప్రమాదాల బారిన పడిన వారిని రక్షించేందుకు జిల్లా పోలీసు శాఖలో పనిచేసే 18 మందికి ప్రత్యేకంగా ఎన్ డి ఆర్ ఎఫ్ వారితో శిక్షణను ఇప్పించి ఈ బృందాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు.ఈ బృందానికి రెస్క్యూ ఆపరేషన్ చేయడానికి ఉపయోగించే అన్ని రకాల పరికరాలను అందించడం జరుగుతుందని అన్నారు. ఇందులో భాగంగానే వరదలు సంభవించినప్పుడు ప్రజలను సురక్షిత ప్రాంతాలకు చేర్చడానికి ఉపయోగించే 12 మంది సామర్థ్యం గల ఇన్ఫ్లాటబుల్ రబ్బర్ బోట్ (ఐ ఆర్ బి)ను అందించడం జరిగింది. ఈ బృందం భద్రాచలం ఏఎస్పీ ఆధ్వర్యంలో నిరంతరం అందుబాటులో ఉంటుందని తెలియజేసారు. విపత్తుల సమయాల్లో పోలీసులు ప్రజలకు ఎల్లప్పుడూ అండగా ఉంటారని తెలియజేయడానికి ఇటీవల సంభవించిన వరదల సమయంలో పోలీసులు చేపట్టిన చర్యలే నిదర్శనమని అన్నారు. డిడిఆర్ఎఫ్ బృందానికి అందజేసిన బోటును ఈ రోజు భద్రాచలం ఏఎస్పీ పంకజ్ పరితోష్ ఐపిఎస్ మరియు డిడిఆర్ఎఫ్ బృంద సభ్యులు పరిశీలించారు.

# రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపు ఖాయం

## కాంగ్రెస్ నాయకురాలు బానోత్ విజయలక్ష్మి – నియోజకవర్గంలో విస్తృత పర్యటన





**ఇల్లందు, ఆగస్టు 05 (మనం న్యూస్):** ఇల్లందు నియోజకవర్గ కాంగ్రెస్ నాయకురాలు విజయలక్ష్మి శనివారం ఇల్లందు నియోజకవర్గ పరిధిలో విస్తృతంగా పర్యటించారు. నియోజకవర్గంలో కాంగ్రెస్ జెండాను ఎగురవేసి కాంగ్రెస్ సత్తాను ప్రజల్లో చాటాలని కోరారు. శనివారం టేకులపల్లి మండలం లాలు తండా, రాజు తండా, సీతారాంపురం గ్రామాలలో విజయలక్ష్మి. విస్తృతంగా పర్యటించారు. గ్రామంలో ప్రజల కష్టాలు తెలుసుకుంటూ కాంగ్రెస్ ప్రభుత్వం వస్తే ఏ విధంగా లబ్ధి చేకూరుస్తాను వారికి వివరించారు. వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని ఎవరు అధైర్య పడద్దని అందరికీ కాంగ్రెస్ అండగా ఉంటుందని ధైర్యాన్ని చెప్పారు. విజయలక్ష్మితో పాటు ఆమె భర్త బానోత్ కిషన్ నాయక్ ఉమ్మడి ఖమ్మం జిల్లా కాంగ్రెస్ డిసిసి సెక్రెటరీ సిహెచ్ వీరబాబు శ్రీను గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# సుప్రీం తీర్పు అవినీతి ప్రభుత్వానికి చెంప పెట్టు

## జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు పువ్వాళ్ళ దుర్గా ప్రసాద్





**ఖమ్మం, ఆగష్టు 5(మనం బ్యూరో) :** ఆల్ ఇండియా కాంగ్రెస్ మాజీ అధ్యక్షులు రాహుల్ గాంధీ పై సూరత్ కోర్టు విధించిన తీర్పుపై సుప్రీం కోర్టు స్టే విధించిడం బిజెపి ప్రభుత్వానికి చెంపపెట్టు లాంటిదని అశాంతి ద్వేషం పై ప్రేమ శాంతి గెలిచిందని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు దుర్గాప్రసాద్ అన్నారు. శనివారం జిల్లా కాంగ్రెస్ కార్యాలయం సంజీవరెడ్డి భవనంలో పార్టీ శ్రేణులతో కలిసి సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి స్వీట్లు పంచి,బాణాసంచా కాల్చినారు . అనంతరం పువ్వాళ్ళ దుర్గాప్రసాద్ మాట్లాడుతూ.. రాహుల్ గాంధీ హత్ సే హత్ జోడో యాత్ర తో కాంగ్రెస్ కు రాహుల్ గాంధీ కి పెరుగుతున్న ఆదరణ చూడలేక బిజెపి ప్రభుత్వం కుట్ర పూరితంగా అసత్య ఆరోపణలు చేసి తప్పుడు కేస్ లను నమోదు చేయించి రాహుల్ గాంధీ దెబ్బ తీయాలని బిజెపి ప్రభుత్వం చూస్తుందని ఆరోపించారు. బిజెపి పన్నిన పన్నాగలకు సుప్రీం తీర్పుతో బీజెపి బుద్ధి చెప్పిందని అన్నారు. చేడు పై మంచి ఎప్పుడు గెలుస్తుందని మరో సారి నిరూపితం అయిందని అన్నారు.ఈ కార్యక్రమంలో వీరితో పాటు పీసీసీ సభ్యులు రాయల నాగేశ్వరావు,పుచ్చకాయల వీరభద్రం,నగర కాంగ్రెస్ కమిటి కార్యనిర్వాహక అధ్యక్షులు నాగండ్ల దీపక్ చౌదరి,రాష్ట్ర ఓబీసీ నాయకులు వడ్డెబోయిన నరసింహారావు, జిల్లా మైనారిటీ అధ్యక్షులు సయ్యద్ ముజాహిద్ హుస్సేన్,జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు దొబ్బల సౌజన్య,రాష్ట్ర మహిళా కాంగ్రెస్ ఉపాధ్యక్షురాలు పగడాల మంజుల,మహిళా కాంగ్రెస్ ఖమ్మం పార్లమెంటరీ నియోజకవర్గ ఇంచార్జ్ అమర్జ హన్ బేగ్,కార్పొరేటర్లు లకావత్ సైదులు నాయక్, దుద్ధుకూరి వెంకటేశ్వర్లు, రఫీదాబేగం, నాయకులు చోటాబాబా, మిక్కిలినేని నరేందర్, పల్లెబోయిన భారతి చంద్రం,కోప్పెర ఉపేందర్, వైరా నియోజకవర్గ ఎల్‌డిఎం ఆర్డినేటర్ మద్దినేని రమేష్, మాజీ కౌన్సిలర్ పాలకుర్తి నాగేశ్వరావు, నగర మైనారిటీ, ఎస్టి,సేవాదళ్,ఓబీసీ, ఐఎన్‌టియుసి అధ్యక్షులు ఎస్‌కె అబ్బాస్ భాయ్, దేవత శంకర్ నాయక్, ఎస్‌డి గౌస్, బాణాల లక్ష్మణ్,నరాల నరేష్,తవిడబోయిన రవి,గజ్జి సూర్యనారాయణ, కల్వకుంట్ల గోపాల్,తూములూరి లక్ష్మీనరసింహారావు, కొంటెముక్కల నాగేశ్వరావు,భూక్యా బాలాజి,సాదే శంకర్,పల్లా లింగయ్య, కిలారి అనిల్ కుమార్,బీరెడ్డి రమేష్,బచ్చలకూరి నాగరాజు, జెరరిపోతుల అంజనీ కుమార్,యడవల్లి నాగరాజు, ఏలూరి రజని,కొత్తపల్లి పుష్ప,ప్రభావతి రెడ్డి,రేణుక,సంధ్య వాసవి,వాసిమ్ మహమూద్ తదితరులు పాల్గొన్నారు.



# చంద్రబాబు పర్యటనను అడ్డుకోవడం సిగుచేటు

## దాడికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలి

## టిడిపి నియోజకవర్గ కోఆర్డినేటర్ ముద్రగడ వంశీ

**ఇల్లందు, ఆగస్టు 05 (మనం న్యూస్) :** తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వర్యులు నారా చంద్రబాబు నాయుడును నిన్న పుంగనూరులో పోలీసుల సమక్షంలో అడ్డుకోవడం హేయమైన చర్య అని ఇల్లందు తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ కోఆర్డినేటర్ ముద్రగడ వంశీ పేర్కొన్నారు. రాష్ట్రంలో సుదీర్ఘ కాలం పాటు ముఖ్యమంత్రిగా, ప్రతిపక్ష నాయకుడుగా పని చేసి దేశంలోనే అత్యంత సీనియర్ రాజకీయ నాయకులుగా పేరొంది జెడ్ ప్లస్ సెక్యూరిటీ కలిగిన చంద్రబాబు పర్యటననే అడ్డుకుని దాడి చేశారంటే ఇంక రాష్ట్రంలో సామాన్యులు పరిస్థితి ఏంటని ప్రశ్నించారు. తక్షణమే దాడికి కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రానున్న రోజుల్లో తగిన మూల్యం చెల్లించక తప్పదని హెచ్చరించారు. సమావేశంలో టిఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు చాందావత్ రమేష్ బాబు,తెలుగుదేశం పార్టీ ఇల్లందు పట్టణ అధ్యక్షులు పాలమాలు బాలకృష్ణ, ప్రధాన కార్యదర్శి ఉప్పునూతల రాజేందర్ గౌడ్,ఉపాధ్యక్షులు అయ్యూరి నాగరాజు, శ్యామ్ తీవరి,కారు నర్సన్న,కంది రవి, టీఎన్ఎస్ఎఫ్ నాయకులు దాసరి గోపాలకృష్ణ, శ్రీవెద్ తదితరులు పాల్గొన్నారు.

# కెసిఆర్, కేటీఆర్, తన్నీరు హరీష్ రావుల చిత్రపటానికి పాలాభిషేకం

## బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు నాదెండ్ల శ్రీనివాస్ రెడ్డి



**ఇల్లందు, ఆగస్టు 05 (మనం న్యూస్):** ఇల్లందు బిఆర్ఎస్ ఇల్లందు మండల పట్టణ గ్రామీణ కమిటీ యూత్ విభాగం ఆధ్వర్యంలో శనివారం ఇల్లందు ప్రభుత్వ వైద్యశాల వైద్యశాల ఆవరణంలో సీఎం కేసీఆర్, కేటీఆర్, తెలంగాణ రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి తన్నీరు హరీష్ రావు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఇల్లందు పట్టణ అధ్యక్షులు నాదెండ్ల శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ఇల్లందు ప్రభుత్వ వైద్యశాల వైద్య విధాన పరిషత్ గా రూపాంతరం చెందడంలోనూ నేడు 30 పడకల ఆసుపత్రి నుండి 100 పడకల ఆసుపత్రిగా రూపాంతరం చెందడంలో ఎమ్మెల్యే హరిప్రియ నాయక్ కృషి ఎనలేనిదన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ ఇల్లందు పట్టణ కమిటీ ఇల్లందు మండల కమిటీ ఇల్లందు పట్టణ ప్రజా ప్రతినిధులు, ఇల్లందు మండలం ప్రజా ప్రతినిధులు, యూత్ విభాగం పాల్గొన్నారు.

# విద్యార్థి సంఘ నాయకుల అక్రమ అరెస్టులు

## పీడిఎస్‌యు జిల్లా అధ్యక్ష కార్యదర్శులను విడుదల చేయాలి



**ఇల్లందు, ఆగస్టు 05 (మనం న్యూస్):** విద్యా రంగ సమస్యలు పరిష్కరించాలని చలో అసెంబ్లీ ముట్టడించిన పిడిఎస్యు నాయకులను అరెస్టు చేయడాన్ని ఖండించాలని పిడి ఎస్‌యు ఇల్లందు మండల అధ్యక్షుడు దారావత్ వంశీ పేర్కొన్నారు. పెండింగ్ లో ఉన్న 5వేల కోట్ల పైచిలుకు స్కాలర్ షిప్స్,రీయంబర్స్ మెంట్ డబ్బులను విడుదల చేయాలన్నారు. విద్య సంస్థల్లోకి మీడియాను/ విద్యార్థి సంఘాలకు అనుమతి నిరాకరిస్తూ జారీ చేసిన సర్క్యులర్ వెనక్కి తీసుకోవాలనీ, సంక్షేమ హాస్టల్స్ సమస్యలను పరిష్కరించాలనీ.కార్పొరేట్ విద్యాసంస్థలు/ప్రైవేటు యూనివర్సిటీలలో ఫీజుల దోపిడీని అరికట్టాలనీ.ఎయిడెడ్ కాలేజీలను ప్రభుత్వం స్వాధీనం చేసుకొని,అభివృద్ధి చేయాలనీ. ప్రభుత్వ యూనివర్సిటీలలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలనీ అసెంబ్లీ ముట్టడించిన నాయకులను విడుదల చేయాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సుధాకర్, సంపత్,నరేష్,వినయ్,ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు....

# ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లండి..

## నాయకులు క్షేత్రస్థాయిలో ప్రజలకు అందుబాటులో ఉండాలి

## మూడోసారి బిఆర్ఎస్ గెలుపు ఖాయంః ప్రభుత్వ విప్ రేగా కాంతారావు



**మణుగూరు, ఆగస్టు 5 (మనం న్యూస్):** పినపాక నియోజకవర్గ పరిధిలోని అన్ని మండలాల్లో ప్రజల సమస్యల పట్ల ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు, నాయకులు ,అందుబాటులో ఉండాలని, ప్రభుత్వ పథకాలను ప్రజల వద్దకు తీసుకెళ్లాలని ప్రభుత్వ విప్ , పినపాక శాసనసభ్యులు రేగా కాంతారావు పేర్కొన్నారు. అదే విధంగా అత్యవసర పరిస్థితులలోనే మణుగూరు పట్టణ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి ప్రజాప్రతినిధులు, నాయకులు రావాలని, మిగతా సమయాన్ని ప్రజల శ్రేయస్సు కోసం పాటుపడాలని వారు పిలుపునిచ్చారు. తెలంగాణ రాష్ట్ర సీఎం కేసీఆర్ అన్ని వర్గాల ప్రజలకు ఎన్నో అభివృద్ధి సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి ప్రజలను కంటికి రెప్పలా కాపాడుకుంటున్నారని వారు గుర్తు చేశారు. వెనుకబడిన తరగతులకు వారి వేడుకలకు సైతం నూతన దుస్తుల పంపిణీ చేయడం జరిగిందన్నారు. అదేవిధంగా దళిత బంధు పథకం ప్రవేశపెట్టడం జరిగింది అన్నారు,. గిరిజనులకు పోడుపట్టాలు పంపిణీకి అహర్నిశలుగా కష్టపడి అండగా నిలిచారని గుర్తు చేశారు. అనేక కుటుంబాలు నిరుపేదలుగా ఉండడంతో ఆడబిడ్డలు తల్లిదండ్రులకు భారం కాకుండా కళ్యాణ లక్ష్మి షాదీ ముబారక్ సంక్షేమ పథకాలతో 1 లక్ష 1,016ల అందిస్తూ ఆ కుటుంబానికి పెద్దన్నగా నిలిచారని తెలిపారు. వృద్ధులకు, వికలాంగులకు, వితంతువులకు, ఒంటరి మహిళలకు సైతం 3116ల నుండి 4116లుగా పెంచుతూ ఆసరా పింఛన్లను పంపిణీ చేస్తున్నారని అన్నారు. రైతులకు సైతం 24 గంటలు ఉచిత విద్యుత్ సౌకర్యాన్ని కల్పించి రైతులకు భారాన్ని తొలగించిన ఘనత సీఎం కేసీఆర్ దేనన్నారు. అందుకే ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించాలని కోరారు. బిఆర్ఎస్ పార్టీకార్యకర్తలు,ప్రజాప్రతినిధులు ,నాయకులు , అన్ని అనుబంధ సంఘాల అధ్యక్షులు, ఎంపీపీ లు, జడ్పిటిసి లు, ఎంపీటీసీలు, సర్పంచ్ లు , రైతు సమన్వయ సమితి అధ్యక్షులు, ఉప సర్పంచ్ లు, వార్డు సభ్యులు సైతం అనునిత్యం ప్రజల మధ్యనే ఉండి బిఆర్ఎస్ పార్టీ చేస్తున్న ప్రతి పథకాలను ప్రజలకు అర్థమయ్యే రీతిలో అవగాహన కల్పించాల్సిన అవసరం మనందరిపై ఉందని వారు సూచించారు.

# ఉపాధ్యాయుల ప్రమోషన్స్ బదిలీలు వెంటనే చేపట్టాలి

## టీఎస్ యుటిఎఫ్ మండల అధ్యక్షులు షేక్ మీరా హుస్సేన్




**మణుగూరు, ఆగస్టు 5 (మనం న్యూస్):** ఉపాధ్యాయుల ప్రమోషన్స్ బదిలీలు వెంటనే చేపట్టాలని టీఎస్ యుటిఎఫ్ మండల అధ్యక్షులు షేక్ మీరా హుస్సేన్ డిమాండ్ చేశారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మణుగూరు ఎడ్యుకేషన్లో వృత్యాంతర శిక్షణ ఎఫ్.ఎల్ ఎన్. రెండవ బ్యాచ్ లో శిక్షణ పొందుతున్న అశ్వాపురం, మణుగూరు మండలాల ఉపాధ్యాయుల శిక్షణ శిబిరాన్ని టీఎస్ యుటిఎఫ్ మణుగూరు మండల బృందం సందర్శించింది. ఉపాధ్యాయులతో వారి సమస్యల మీద చర్చించారు. ఈ సందర్భంగా టీఎస్ యుటిఎఫ్ మణుగూరు మండల అధ్యక్షులు షేక్ మీరా హుస్సేన్ మాట్లాడుతూ..ప్రభుత్వం వెంటనే స్పందించి ఉపాధ్యాయుల బదిలీలు పదోన్నతులను వెంటనే చేపట్టాలని, మధ్యంతర భృతి కూడిన కూడిన పిఆర్సిని వెంటనే ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. క్యాష్ లెస్ ఆరోగ్య పథకాన్ని పటిష్టంగా అమలు పరచాలని, కొత్త పెన్షన్ విధానాన్ని రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని, డీఎస్సీ 2003 వారికి కేంద్ర ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం పాత పెన్షన్ వర్తింపచేయాలని, ఆదాయ పన్ను పరిమితిని 8 లక్షలకు పెంచాలని ప్రభుత్వాన్ని కోరారు. నూతన విద్యా విధానం పేరుతో సిలబస్ నుంచి శాస్త్రీయ అంశాల్ని తొలగించటం సరికాదు అన్నారు. వృత్యాంతర శిక్షణలో బోధన మెళుకువలు నాణ్యమైన విద్యాబోధనలో ఎంతో ఉపయోగపడతాయని, తరగతిగది బోధనలో ఆహ్లాద కరమైన వాతావరణాన్ని కలిగిస్తాయని, ప్రతి టీచర్ బోధనలో అప్డేట్ అవుతూ టెక్నాలజీని ఉపయోగించుకుని బోధనను సరళీకృతం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కోర్స్ డైరెక్టర్, ఎంఈఓ వీరస్వామి, రిసోర్స్ పర్సన్స్, టీఎస్ యుటిఎఫ్ మండలాధ్యక్షుడు షేక్ మీరా హుస్సేన్, ట్రెజరర్ మీ రెడ్డి ఇంద్రసేనారెడ్డి, సీనియర్ నాయకులు సిహెచ్. శ్రీనివాసు, వజ్జా కృష్ణమూర్తి, రెండు మండలాల ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# మరో మారు రైతులను మోసపోకండి

## రైతు కూలీలతో కలిసి నాటు వేసిన మాజీ ఎమ్మెల్యే పాయం





**మణుగూరు, ఆగస్టు 5 (మనం న్యూస్):** మణుగూరు మండల పరిధిలోగల కూనవరం గ్రామంలో మాజీ ఎంఎల్ఏ పాయం వెంకటేశ్వర్లు పర్యటించి రైతు యాజమాన్యంతో వారి కష్టసుఖాలను తెలుసుకుంటూ రైతు కూలీలతో కలిసి నాటు వేశారు. కేసీఆర్ ప్రభుత్వం వచ్చిన తరువాత వ్యవసాయదారులకు కష్టాలు వచ్చాయని, కనీసం రైతులకు గిట్టుబాటు ధర కల్పించలేని ప్రభుత్వం మనకు వద్దంటూ ఎనిమిది సంవత్సరాలుగా గుర్తుకురాని రైతుల రుణమాఫీ ఈరోజు కాంగ్రెస్ పార్టీ నాయకులు, బి ఆర్ ఎస్ ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తే తప్ప గుర్తుకురాలేదన్నారు. మరో మారు రైతులను మోసం చేయడానికి లక్ష అప్పు ఉన్న రైతులందరికీ రుణమాఫీ అంటూ మాయ మాటలు చెబుతూ రైతుల ఓట్ల కోసం మరో మారు మారువేషంలో వస్తున్నాడంటూ కేసీఆర్ పై మండిపడ్డారు. రాబోయే రోజుల్లో రైతులను కాపాడే ప్రభుత్వాన్ని ఎన్నుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మణుగూరు మండల వైస్ ఎంపీపీ కరివేద వెంకటేశ్వరరావు, ఉప సర్పంచులు పుచ్చకాయల శంకర్, గోరంట్ల కనకయ్య, ఎస్కే బాజీ, వెంకట్రావు గౌడ్, తరుణ్ రెడ్డి,నాయకులు టి వి సుబ్బరెడ్డి,నిట్ట జీవరత్నం, పాల్వంచ రాములు,మాదాడి రాజేష్,బల్లెం సురేష్,ఎస్కే మైబూబ్ పాష,కటుకురి శ్రీనివాసరావు, చింతల కృష్ణ,సుర రాజు,బత్తుల నవీన్, కారం నాగేంద్రబాబు, కోడి అశోక్,బడిష నాగేశ్వరరావు,కుర్రి కృష్ణ,కుర్రి నారాయణ,నిరుడు మోహన్,తదితరులు పాల్గొన్నారు.

# పౌష్టిక విలువలు కలిగిన రాగిజావా పంపిణీ



**బూర్గంపహాడ్, ఆగస్టు 5 (మనం న్యూస్)ః** మండల పరిధిలోని మోరంపల్లి బంజార గ్రామం లో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు రాగి జావ పంపిణి కార్యక్రమాన్ని శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా జడ్పిటిసి కామిరెడ్డి శ్రీలత మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు పౌష్టిక విలువలు కలిగిన ఆహారాన్ని అందించడంలో భాగంగా విద్యార్థులకు రోజు మార్చి రోజు వారానికి మూడుసార్లు రాగి జావా అందిస్తుందన్నారు. పౌష్టిక విలువలు కలిగిన ఆహారం తీసుకోవడం వలన విద్యార్థులు ఆరోగ్యంగా ఉంటారని, చదువులోను, ఆటలోను చురుకుగా పాల్గొనడానికి మంచి శక్తిని అందిస్తుందని అన్నారు. విద్యార్థుల కోసం ఇలాంటి మంచి కార్యక్రమాలను అమలు చేస్తున్న తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ భూక్య దివ్య, నియోజకవర్గ పరిశీలకులు మేడం లక్ష్మి నారాయణ రెడ్డి, మండల బి.సి. సేల్ అధ్యక్షులు చేతులు వీర్రాజు, బిఆర్ ఎస్ పార్టీ నాయకులు పేరం రామిరెడ్డి, బత్తుల రామకొండ రెడ్డి, చిన్నప్ప రెడ్డి, ప్రధానోపాధ్యాయులు కోంద్రు వెంకటేశ్వర్లు ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు, పాత్రికేయులు జక్కిరెడ్డి మల్ల రెడ్డి, శనగ మల్లేష్, తదితరులు పాల్గొన్నారు.

# అందరికీ న్యాయమా? కొందరికి న్యాయమా?



**బూర్గంపహాడ్, ఆగస్టు 5 (మనం న్యూస్)ః** మైనార్టీలందరికీ లక్ష రూపాయల పథకం వస్తుందా లేక కొందరికేనా? అని మైనార్టీలు ఆందోళన చెందుతున్నారు. ఈ పథకము ద్వారా అందరికీ న్యాయం జరగాలని ఆశాభావం వ్యక్తం చేశారు. మండలంలో మైనారిటీల సంఖ్య ఎంత ?, ఎంత మందిని ఎంపిక చేస్తారు, ఎంపిక చేసే కార్యక్రమంలో పక్షపాతం లేకుండా ఎంపిక జరుగుతుందా?, అధికార పార్టీ అందరికీ న్యాయం చేస్తుందా? లేక మైనార్టీలకు అందరికీ అందుతుందా లేదా అనేది అందరిలో ఉన్న సందేహం. పెట్టేవాడు మనవాడైతే కిటికీలో నుండి కూడా అందిస్తాడు . ఇదే కదా మన రాష్ట్రంలో జరుగుతున్న రాజకీయ పరిస్తితి. ఏది ఏమైనా అందరికీ సమన్యాయం జరగాలని మైనారిటీలలో వర్గ విభేదాలు రాకుండా న్యాయం చేయాలని అందరూ ఆశిస్తున్నారు.

# 8న రెడ్ రిబ్బన్ 5కె రన్ 2023

**భద్రాచలం, ఆగస్టు 5( మనం న్యూస్) :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎయిడ్స్ నివారణ, నియంత్రణ విభాగం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ వారి ఆధ్వర్యంలో యన్ యస్ యస్ సహకారంతో డిగ్రీ, పిజీ, జూనియర్ కలాశాల (రెడ్ రిబ్బన్ క్లబ్) విద్యార్థులకి అంతర్జాతీయ యువజన ఉత్సవాలలో భాగంగా (వయసు 17–25 సంవత్సరాలు) భద్రాచలం డిగ్రీ కళాశాల యన్.యస్.యస్. జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ వారి ఆద్వర్యంలో రెడ్ రిబ్బన్ 5 కె రన్ ఈ నెల 8న నిర్వహించనున్నారు. .ఆసక్తి గల భద్రాద్రి కొత్తగూడెం జిల్లా విద్యార్థులు వారి పేర్లను తేది 07 సోమవారం సాయంత్రం 8 లోపు ఈ క్రింద తెలిపిన ఫోన్ నంబర్లకు వాట్సప్ చేసి రెజిస్టర్ చేసుకోగలరు. 9866207015 ఫోన్ నంబర్స్: 1 -- (ఆనంద్- యన్ యస్ యస్ డి.పి.ఓ)2 9963130775(ఉదయ్)

# భద్రాచలం లిక్కర్ షాపులో టెండర్ నోటిఫికేషన్ పై గ్రామ సభ ఏర్పాటు

## ఎక్సైజ్ అధికారులకు వినతి




**భద్రాచలం,ఆగస్టు 5( మనం న్యూస్) :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం 2023 –2025సంవత్సరానికి గాను మద్యం షాప్ టెండర్ల కోసం మద్యం షాపుల నోటిఫికేషన్ ఇచ్చిన అంశంపై భద్రాచలం ఆదివాసి సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో భద్రాచలం పిసా గ్రామ కమిటీ తీర్మానాన్ని పరిగణనకు తీసుకోవాలని శనివారం నాడు ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ కార్యాలయంలో వినతి పత్రం సమర్పించారు.1996 పిసా చట్టం అనుసరించి గ్రామ సభ ఆమోదం ద్వారానే మద్యం షాపుల టెండర్ నోటిఫికేషన్ ప్రక్రియ పూర్తి చేయాలని అందుకు భద్రాచలం పిసా గ్రామ కమిటీ అనుమతి తీసుకోవాలని సందర్భంగా వారు విజ్ఞప్తి చేశారు. ఆగస్టు7వ తేదీ ఉదయం 11 గంటలకు జరిగే పిసా కమిటీని చేయాలని వారు కోరారు. ఎక్సైజ్ కార్యాలయంలో ఎస్త్ర సంబంధిత సిబ్బందికి వినతి పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో భద్రాచలం మాజీ జెడ్పిటిసి గుండుశరత్, మాజీ ఎంపీపీ గొంది బాలయ్య, భద్రాచలం ఆదివాసి సమితి అధ్యక్షులు పూణేం కృష్ణ తదితరులు పాల్గొన్నారు.